సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం : 29 : జూన్ : 2024



మేకల మందలతో మేలు

ఖాళీ వరి చేలల్లో మేకలు, గొర్రెల మందలను వదలడం ద్వారా మేలు జరుగుతుంది. వాటి విసర్జనాలు నేలకు సేంద్రియ ఎరువుగా ఉపకరిస్తాయి. 8లో ▸



ఆరోగ్యకరమైన నారుతో..

రైతులు నారుమడులు వేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸



మట్టి అక్రమ తరలింపు

పట్టిసీమ ఎత్తిపోతల పథకం సమీపంలో డంప్ చేసిన మట్టిని కొద్ది రోజులుగా అక్రమంగా తరలిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. 8లో ▸

న్యూస్‌రీల్

ఉదయం 6 నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభం



మాట్లాడుతున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ జూలై 1న ఉదయం 6 గంటలకు ప్రారంభం కావాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమీక్షించారు. ముందుగానే బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీపై సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. నగదును భద్రపరచడంలో నిర్లక్ష్యం తగదన్నారు. లబ్ధిదారులకు పింఛన్‌తో పాటు రసీదుతో ఫొటో, కరపత్రాన్ని అందజేయాలన్నారు. సమన్వయంతో పెన్షన్ల పంపిణీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా అభివృద్ధి అధికారి కేసీహెచ్ అప్పారావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ వేణుగోపాల్, డీఎల్‌డీఓ ఏవీ అప్పారావు, ఏపీఓ టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

టైమ్ మేనేజ్‌మెంట్ తప్పనిసరి



మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ చిట్టిరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థులు టైమ్ మేనేజ్‌మెంట్‌తో తమ విద్యాభ్యాసాన్ని సులభతరం చేసుకోవచ్చని సివిల్ ర్యాంకర్ కొయ్యే చిట్టిరాజు అన్నారు. పట్టణంలోని శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీలో విద్యార్థులతో శుక్రవారం చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ రెస్పాన్సిబిలిటీ, టైం మేనేజ్‌మెంట్, ఫిజికల్ ఛాలెంజెస్ వంటి పలు అంశాలపై చర్చించారు. బిపిన్ చంద్ర, లక్ష్మీకాంత్, రమేష్ చంద్ వంటి రచయితల పుస్తకాలు విద్యార్థుల ప్రిపరేషన్‌కు ఉపకరిస్తాయన్నారు. డైరెక్టర్ ఫర్ జనరల్ అడ్మిన్ జె.ప్రసాద రాజు, పి.శ్రీనివాసరాజు, ఏజీఎం ఎం.రమేష్, ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు (టూటౌన్): డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వచ్చే నెల 11 నుంచి ఏలూరులో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో వచ్చే నెల 8లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్హత, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా వచ్చి సంప్రదించాలన్నారు. 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టయిఫండ్ కింద నెలకు 1,500 చొప్పున రూ.3 వేలు, బుక్స్ అలవెన్స్ రూ. 1,000 చొప్పున అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు బీసీ స్టడీ సర్కిల్, కేరాఫ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లిష్ మీడియం యూపీ స్కూల్, వెన్నవెల్లివారిపేట, ఏలూరు, సెల్ 99123 94799, 83419 91001 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్ సమావేశపు హాలులో ఉదయం 10 గంటలకు లోక్ అదాలత్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన బెంచ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకుని సమయం, డబ్బును ఆదా చేసుకోవాలని ఆయన కోరారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. జిల్లాస్థాయిలో కమాండ్ కంట్రోల్ టీమ్‌ను ఏర్పాటు చేశామని, 24 గంటలు ఈ టీమ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధాలక్ష్మి ఆధ్వర్యంలో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని అమలు చేయనున్నామన్నారు. ఆరోగ్య సిబ్బంది, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచామని డీఎంహెచ్ఓ తెలిపారు.

సాయం అందక వలవిల

కడలి ఒడిలో చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులు వేట నిషేధ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సముద్రంలో వేట నిషేధ సమయం ముగిసి 15 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ వీరికి సాయం అందలేదు. సముద్రాన్ని నమ్ముకుని వలలు పట్టుకుని ఆశగా వేట ప్రారంభించిన గంగపుత్రులకు ఈ ఏడాది మత్స్యకార భరోసా దక్కలేదు. వేట నిషేధ సాయం అందకపోవడంతో వీరంతా ఇబ్బంది పడుతున్నారు.

మత్స్యకార భరోసాకు మంగళం!

- వేట నిషేధ సాయమెప్పుడో..
- సముద్రంలో వేట ప్రారంభమై 15 రోజులు
- కూటమి సర్కారు నిర్ణయం కోసం ఎదురుచూపులు
- గత ఐదేళ్లుగా సాఫీగా వేట



అలలపై ఆశల వల.. వేటకు వలలు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు (ఫైల్)

నరసాపురం: 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సముద్రంలో వేట సాగించే మత్స్యకారుల సంక్షేమంపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఏటా వేట నిషేధ సమయంలో అందించే సాయాన్ని రెండున్నర రెట్లు పెంచడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యనూ భారీగా పెంచారు. మత్స్యకార భరోసా పథకాన్ని ప్రవేశపెట్టి ఏటా ముందుగానే మే నెలలో సాయం అందించారు. అయితే రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాదిలో ఇప్పటివరకూ వేట నిషేధ సాయంపై కనీసం ప్రకటన కూడా చేయకపోవడంతో వేటకారులు ఆందోళన చెందుతున్నారు.


గతంలో జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే..

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయానికే వేట నిషేధం అమల్లో ఉండటంతో ఆ ఏడాదే మత్స్యకార భరోసా పథకాన్ని జగన్ ప్రవేశపెట్టారు. జిల్లాలో అప్పటికి కేవలం 173 మంది ఉన్న లబ్ధిదారుల సంఖ్యను 1,072కు పెంచి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున తొలి ఏడాది సాయం అందించారు. గతంలో వేట నిషేధ సమయం ముగిసిన ఐదారు నెలలకు కానీ సాయం అందని పరిస్థితి నుంచి ఏటా మే నెలలోనే సాయం అందించేలా జగన్ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో క్రమం తప్పకుండా మత్స్యకారుల ఖాతాలకు సొమ్ములు జమచేశారు.

గత ఐదేళ్లలో రూ.7.87 కోట్లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 19 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. నరసాపురం ప్రాంతంలో సుమారు 2,000 మంది సముద్రపు వేటను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు వేట నిషేధాన్ని అమలు చేస్తుంది. ఈ 61 రోజుల పాటు మత్స్యకారులు ఖాళీగా ఉంటారు. ఉపాధి కోల్పోయి ఇబ్బంది పడుతుంటారు. చేపల వలలు, బోట్లు మరమ్మతులు చేసుకుంటూ వేట కోసం ఎదురుచూస్తుంటారు. ఈ ఖాళీ సమయంలో వారికి మత్స్యకార భరోసా సొమ్ములు అండగా ఉన్నాయి. అయితే ఈ ఏడాదిలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే నెలలో సాయం అందలేదు. ప్రస్తుత సర్కారు ఇప్పటికీ నిర్ణయం తీసుకోలేదు. గత జగన్ ప్రభుత్వంలో జిల్లాలో ఐదేళ్లలో 6,427 మందికి రూ.7.87 కోట్లను మత్స్యకార భరోసా కింద సాయం అందించింది. మరి ఇప్పుడు కూటమి సర్కారు ఎంతమందికి సాయం అందిస్తుంది? అసలు అందిస్తుందా? లేదా అనే ఆందోళనలో మత్స్యకారులు ఉన్నారు.

ఇస్తారో.. ఇవ్వరో..



చిన్నప్పటి నుంచి వేట తప్ప నాకు మరేమీ తెలియదు. వేసవిలో రెండు నెలలు వేట ఉండదు. చాలా ఇబ్బందిగా ఉంటుంది. జగన్ సర్కార్ మాకు ఏడాదికి రూ.10 వేల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేలు వేట నిషేధ సాయం అందించింది. ఏటా మే నెలలో మా ఖాతాల్లో సొమ్ములు జమయ్యేవి. ఈ ఏడాది ఒక్క రూపాయి పడలేదు. అసలు ఇస్తారో, ఇవ్వరో కూడా తెలియడం లేదు.

– తిరుమాని ఏడుకొండలు, వేట కార్మికుడు, నరసాపురం

గతంలో ఇబ్బంది లేకుండా..



జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా వేట లేని సమయంలో ఇబ్బంది తెలియలేదు. ఐదేళ్ల నుంచి ప్రతి ఏటా మే నెలలో మత్స్యకార భరోసా డబ్బులు రూ.10 వేల చొప్పున పక్కాగా ఇచ్చారు. ఈ ఏడాది ఎన్నికలు అని ఇవ్వలేదంట. ఎప్పుడిస్తారో తెలియడం లేదు. పెద్ద బోట్లే కాదు చిన్నపాటి చెక్క నావలపై వేట సాగించే వారికి కూడా జగన్ వేట నిషేధ సాయం అందించారు.

– తిరుమాని ఏసుబాబు, వేట కార్మికుడు, వేములదీవి

జిల్లా అభివృద్ధికి కృషి

కలెక్టర్ నాగరాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా కొత్త కలెక్టర్‌గా సి.నాగరాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మధ్యాహ్నం భీమవరం కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె చాంబర్‌లోకి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని, అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు తీసుకువెళతామన్నారు. గతంలో తాను వివిధ హోదాల్లో పనిచేశానని, అన్ని శాఖలపై అవగాహన ఉందన్నారు. జిల్లా అభివృద్ధికి అధికారులంతా కృషి చేయాలని కోరారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.పాపారావు, భీమవరం, నరసాపురం ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

వరి నాట్లు వేగిరపర్చండి

రైతులకు జేసీ ప్రవీణ్ ఆదిత్య సూచన



భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఖరీఫ్ సాగుకు త్వరితగతిన వరి నాట్లు పూర్తిచేయడం ద్వారా నవంబరులో తుపానుల బారిన పడకుండా జాగ్రత్త వహించవచ్చని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య రైతులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ సాగు సన్నద్ధతపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్‌లో వచ్చే విపత్తులపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 86,831 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అత్యధికంగా తాడేపల్లిగూడెం మండలంలో 10,224 హెక్టార్లు, అత్యల్పంగా మొగల్తూరు మండలంలో 333 హెక్టార్లలో సాగు ఉందన్నారు.

16 వేల మట్టి నమూనాల లక్ష్యం

జిల్లాలో 2023లో 15,032 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా 10,316 నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించామని జేసీ తెలిపారు. మిగిలిన 4,716 మట్టి నమూనాల సేకరణకు మండలాల వారీగా లక్ష్యాలు నిర్దేశించామన్నారు. అలాగే 2024–25కు గాను 16 వేల మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

48,463 క్వింటాళ్ల విత్తనాలు : జిల్లాకు 48,463 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా 85 క్వింటాళ్ల విత్తనాలను కిలో రూ.5 చొప్పున సబ్సిడీపై అందించామని జేసీ తెలిపారు. సీడ్ విలేజ్ కార్యక్రమం ద్వారా 50 శాతం సబ్సిడీపై 195.5 క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేశామన్నారు. 43,585 క్వింటాళ్ల విత్తనాలను రైతులు స్వయంగా సమకూర్చుకుంటున్నారన్నారు. 4,598 క్వింటాళ్ల విత్తనాలను డీలర్ల ద్వారా సరఫరా చేశామన్నారు. ఎంటీయూ–1318, 7029, 1061, 1064, స్పందన స్వర్ణ, పీఆర్ 126 వెరైటీ విత్తనాలను జిల్లాలో ఎక్కువగా వినియోగిస్తున్నట్లు చెప్పారు.

58 వేల టన్నుల ఎరువులు అవసరం

జిల్లాలో 58,905 టన్నుల ఎరువుల అవసరం కాగా వీటిలో 21,272 టన్నుల యూరియా, 23,464 కాంప్లెక్స్, 2,391 డీఏపీ, 6,391 ఎస్ఎస్‌పీ, 5,387 టన్నుల ఎంఓపీ ఉన్నాయని జేసీ చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం 46,144 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

రూ.4 వేల కోట్ల రుణాలు

ఖరీఫ్ సీజన్‌కు రూ.4,179 కోట్ల పంట రుణాలు, రూ.3,116 కోట్ల టర్మ్ లోన్స్ అందించాలని నిర్ణయించామని జేసీ తెలిపారు. 2023–24కి 84,185 సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ లక్ష్యం కాగా 90,053 కార్డులు అందించామన్నారు. డ్రెయిన్ల పూడికతీత, కిక్కిస తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులకు జేసీ సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వర రావు, డ్రెయినేజీ శాఖ ఈఈ ఎంవీవీ కిషోర్, కాలువల ఈఈ ఎం.దక్షిణామూర్తి, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్స్ పీఈటీల సంఘ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షురాలు మాధవీలతను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ఏలూరు జిల్లా మున్సిపల్ స్కూల్స్ పీఈటీ సంఘం అధ్యక్షురాలిగా కె.మాధవీలత ఎన్నికయ్యారు. శుక్రవారం ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాలలో సంఘ సభ్యులు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సుధీర్ మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక సర్వీస్ రూల్స్ ఏర్పాటుచేయాలన్నారు. మున్సిపల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని, ఇన్‌సర్వీస్‌లో బీఈడీ కోర్సు చేసేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పీఈటీలను నియమించాలన్నారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక నిర్వహించగా అధ్యక్షురాలిగా మాధవీలత, కార్యదర్శిగా జోజిబాబు, కోశాధికారిగా ప్రసన్న ఎన్నికైనట్టు సుధీర్ ప్రకటించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి సురేష్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

జంగారెడ్డిగూడెం: ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసు కోవాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జంగారెడ్డిగూడెం జోన్ సమావేశాన్ని జోనల్ కన్వీనర్ యూవీ నరసింహరాజు అధ్యక్షతన స్థానిక మండల ప్రాథమిక పరిషత్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ చైర్మన్ నరసింహరాజు మాట్లాడుతూ ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు ఆలస్యమవుతున్నందున ఐఆర్ ప్రకటించాలని కోరారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను సకాలంలో మంజూరు చేయాలన్నారు. ఐటీడీఏ యాజమాన్యంలోని పండిట్, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించి పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. జోన్ కో–కన్వీనర్లు జె. సోమేశ్వర శాస్త్రి, పీవీఆర్ రాజ్యలక్ష్మి, జంగారెడ్డిగూడెం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఏలూరు ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ప్రకటనలో తెలిపారు. తొలి విడత కౌన్సెలింగ్‌కు 454 మంది అర్హత పొందగా 252 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారన్నారు. వారిలో 180 మంది పలు ఐటీఐల్లో ప్రవేశాలు పొందారన్నారు. మిగిలిన సీట్ల భర్తీ కోసం రెండో విడత కౌన్సెలింగ్ ఏర్పాటుచేశామని, జూలై 24న సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం అదేరోజు సాయంత్రం సంబంధిత ఐటీఐల్లో వెరిఫికేషన్ పూర్తి చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు జూలై 27, 28 తేదీల్లో, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు జూలై 29,30 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అలాగే 8వ తరగతి ఉత్తీర్ణులై, 10వ తరగతి అనుత్తీర్ణులైన విద్యార్థులు వెల్డర్ ట్రేడ్‌కు అర్హులన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో 627, ప్రైవేట్ ఐటీఐల్లో 1,650 సీట్లు ఉన్నాయన్నారు. వివరాలకు 08812 230269లో సంప్రదించాలని కోరారు.

స్వల్పకాలిక శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 సంయుక్త ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్ హోమ్ అప్లయన్సెస్, అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సుల్లో స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నట్లు ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో జరిగే శిక్షణ కార్యక్రమాలకు అభ్యర్థులు వచ్చేనెల 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

మనస్తాపంతో వైఎస్సార్‌సీపీ అభిమాని మృతి



మానుకొండ రామకృష్ణ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో మనస్తాపానికి గురైన పార్టీ వీరాభిమాని మృతి చెందిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలో గురువారం రాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వీరంపాలెం గ్రామానికి చెందిన మానుకొండ రామకృష్ణ (52) వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో నాటి నుంచి మనోవ్యథకు గురయ్యాడు. దీంతో అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం రాత్రి రామకృష్ణ మృతి చెందాడు. అతనికి భార్య రేణుక, కుమారుడు సహదేవరాజు, కుమార్తె రమాదేవి ఉన్నారు. రామకృష్ణ మృతికి సర్పంచ్ కేతిరెడ్డి మాధవీలత, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నా యకులు ముప్పిడి పెద్దబ్బులురెడ్డి, ముప్పిడి కృష్ణారెడ్డి, అఖిల్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



ఏలూరులోని జెడ్పీ బంగ్లాలో సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ చైర్మన్ బంగ్లాలో శుక్రవారం జరిగిన జెడ్పీటీసీ సభ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీలకు అతీతంగా పాలన సాగిస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు మారినా నాయకులు ఆయా ప్రభుత్వాలకు మద్దతుగా విధులు నిర్వహిస్తూ ప్రజల అభివృద్ధికి పట్టం కట్టాలన్నారు. భవిష్యత్తులో జిల్లాపరిషత్‌లో ఎటువంటి సమస్యలు, తారతమ్యాలకు తావు లేకుండా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సభ్యులంతా సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులను ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ సూచించారు. సమావేశంలో జిల్లాపరిషత్ వైస్ చైర్మన్‌లు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు. అందరూ జిల్లా అభివృద్ధికి సహకరిస్తామని, పార్టీలకు అతీతంగా పనులు చేసి ప్రజల అభివృద్ధికి పట్టం కడతామని జెడ్పీటీసీ సభ్యులు చెప్పారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా హనుమద్ కళ్యాణం



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ఈఓ ఆకుల కొండలరావు

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయ స్వామి జన్మ నక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం కావడంతో జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి క్షేత్రంలో సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

26 నుంచి ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ యాత్ర

ఏలూరు (టూటౌన్): ఇండియన్ రైల్వేస్ అనుబంధసంస్థ ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో వచ్చే నెల 26 నుండి ఉత్తరాఖండ్ యాత్ర పేరిట భారత్ గౌరవ్ రైలును నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ యాత్ర వచ్చే నెల 26న విశాఖ పట్టణంలో ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ యాత్రంలో భాగంగా బీమాల్, అల్మోరా, కౌశాని, రాణికేత్ వంటి ప్రాంతాలు సందర్శించవచ్చని వివరించారు. అన్ని రకాల వసతులుతో కలిపి రైలు టిక్కెట్ ధర ఒక్కొక్కరికి రూ.28,020గా నిర్ణయించారని తెలిపారు. వచ్చే నెల 26న విశాఖపట్టణంలో ప్రారంభమయ్యే ఉత్తరాఖండ్ యాత్ర రైలు రాజమండ్రి, విజయవాడ, వరంగల్ స్టేషన్లలో ఆగుతుందని పేర్కొన్నారు. టిక్కెట్ల కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో గానీ, విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు. ఇతర వివరాల కోసం 92810 30714 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

బాలిక ఆత్మహత్య

ఏలూరు టౌన్: నగరానికి చెందిన 16 ఏళ్ళ బాలిక తీవ్ర మనస్థాపంతో ఉరి వేసుకుని మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన బాలికను కొద్దిరోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన వరికూటి మధుకుమార్ పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 18న బాలికకు మాయమాటలు చెప్పి మధుకుమార్ తన గ్రామానికి తీసుకువెళ్లాడు. అనంతరం బాలిక అక్కడనుంచి వచ్చేసి తల్లిదండ్రుకి విషయం చెప్పటంతో వారి ఫిర్యాదు మేరకు పోలీసులు మధుకుమార్ పై కేసు నమోదు చేసి అతన్ని అరెస్ట్ చేశారు. మధుకుమార్‌ను అరెస్ట్ చేశారని బాలిక తీవ్రమనస్థాపానికి గురై ఈ నెల 27 రాత్రి తన ఇంట్లో గదిలో ఉరి వేసుకుని మృతి చెందింది. దీంతో పోలీసులు బాలిక మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్యకరమైన నారుతో అద్భుత దిగుబడులు

- నారుమడి వేసుకునే పనిలో రైతుల నిమగ్నం
- ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



ఉండిలో సిద్ధమైన నారుమడులు

ఉండి : గ్రామాల్లో సార్వా సందడి నెలకొంది. వానలు ముమ్మరంగా పడడంతో రైతులు పొలాలను దమ్ము చేసుకుని నారుమడులు వేసుకునే పనిలో ఉన్నారు. అయితే నారుమడి వేసుకునే సమయంలో చేసే తప్పుల వల్ల దిగుబడి విషయంలో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. ఆరోగ్యకరమైన నారుతోనే అద్భుత దిగుబడులు సాధించవచ్చని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నారుమడి యాజమాన్య పద్ధతులను పాటిస్తే మంచి నారు లభిస్తుందని దాని ద్వారా మంచి దిగుబడులు కూడా వస్తాయని వివరిస్తున్నారు.

నారుమడి తయారు చేసుకునే పద్ధతి

- నారుమడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్టు వేసి రెండు,మూడుసార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి.
- దమ్ము చేసిన భాగంలో కొంతమేర నారుమడి కోసం కేటాయించి నీరు, పోషకాలు బయకు పోకుండా కట్టుదిట్టంగా గట్టు వేయాలి.
- 5 సెంట్ల నారుమడికి కేజీ నత్రజని, కేజీ బాస్వరం, కేజీ పొటాష్ వేసుకోవాలి.
- వరిచేను కంటే నారుమడి కొంతమేర ఎత్తుగా ఉంటేనే మంచిది.
- విత్తనాలు చల్లే ముందుగా సుమారు 10 నుండి 12 రోజుల ముందే నారుమడి దమ్ము చేసుకుని ఉండాలి.
- నారుమడికి సులభంగా నీరుపెట్టేందుకు, బయటకు పంపేందుకు వీలుగా ఉన్న ప్రాంతంలోనే నారుమడి తయారు చేసుకోవాలి.
- సెంటు నారుమడికి సుమారు 5 కిలోల చొప్పున విత్తనాలు చల్లుకోవాలి.
- నారుమడికి మొలకలు వచ్చే వరకూ ఆరుతడులు ఇచ్చి తరువాత పల్చగా నీరు నిలువకట్టాలి.
- విత్తనాలు వేసిన అనంతరం 15 రోజుల తరువాత కేజీ నత్రజని వేసుకోవాలి.
- నాట్లు వేయడం ఆలస్యమైతే మరోసారి నత్రజని వేసుకుంటే నారు ముదురిపోకుండా ఉంటుంది. మొక్కదశలో నారుమడిలో నీరు పల్చగా ఉండేలా చూసుకోవాలి.

నారు రక్షణ ఇలా

- నారుమడిలో నారు తీయడానికి 19 రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు 400 గ్రాములు చల్లుకోవాలి.
- నారు కొనభాగాలను తుంచి వేసి నాట్లు వేస్తే కాండం తొలిచే పురుగును నివారించవచ్చు.
- నారును 0.02 శాతం క్లోరోపైరీఫాస్ ద్రావణంలో నాలుగు గంటలు ముంచి నాట్లు వసుకుంటే కాండం తొలిచే పురుగు, ఆకుముడత దోమను నివారించవచ్చు.
- నారు బాగా ముదిరి ఆలస్యంగా నాట్లు వేస్తే కుదురుకు 6 నుంచి 8 మొక్కలు నాటుకుంటే మంచిది.
- పోషక యాజమాన్యం, సస్యరక్షణ ద్వారా నారును పెంచితే ప్రధాన పంట పంట పొలంలో వచ్చే సమ్యల నుండి పంటను కాపాడుకోవచ్చు.

రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలి



నారు ఆరోగ్యంగా, దిగుబడులు అధికంగా రావాలంటే ప్రతి రైతూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసి తీరాలి. దీనిలో భాగంగా కొలో విత్తనానికి 2.5 లేదా 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి ఆరబెట్టి విత్తనశుద్ధి చేసుకోవాలి. తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. విత్తనశుద్ధి చేయడం ద్వారా నారుమడిలో గానీ ప్రధాన పొలంలో గానీ చాలా వరకూ పంటలకు సోకే తెగుళ్ల నుంచి నివారించుకోవచ్చు.

– బి.సంధ్య, మండల వ్యవసాయాధికారి, ఉండి

వ్యవసాయంలో ఇంజినీర్లు అవసరం



ఏపీ నిట్ వెస్ట్ ముఖద్వారం

తాడేపల్లిగూడెం: వ్యవసాయంలో కూడా ఇంజినీర్ల ఆవశ్యకత ఎంతో ఉందని కర్ణాటకలోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఎంటమాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రభురాజ్ ఆరళి మరద్ అన్నారు. వర్చ్యువల్‌గా శుక్రవారం ఏపీ నిట్‌లో వ్యవసాయ రంగంలో ఇంజినీర్, ఆధునిక సాంకేతిక పాత్ర అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభురాజ్ మాట్లాడుతూ పంట విత్తిన దగ్గర నుంచి ఆ పంట చేతికొచ్చేంత వరకు యాంత్రీకరణను అనుసరించడం వల్ల రెట్టింపు ఆదాయాన్ని పొందుతున్నారన్నారు. నేలసారం, తేమ, వాతావరణం వంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోడానికి సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శాప్ యాప్ ద్వారా ద్వారా పంట ఆరోగ్య పరిస్థితులు, తెగుళ్ల వాటి నివారణ పద్ధతులను సులువుగా తెలుసుకోవచ్చన్నారు. శాప్ యాప్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీవీ వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కూలీలకు అస్వస్థత



జంగారెడ్డిగూడెం ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న కూలీలు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడిలో ఒక రైతు బంటా పనుల కోసం వచ్చిన 18 మంది కూలీలు అర్ధరాత్రి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారందరినీ దొరమామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్‌లు ప్రాథమిక వైద్యసేవలు అందించారు. అయితే వీరిలో 14 మందిని మెరుగైన వైద్యం కోసం 108లో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి మేస్త్రీలు రాము, రత్తయ్యలు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన 60 మంది పొగాకు బంటా కూలీలు బుట్టాయగూడెం మండలం దొరమామిడికి చెందిన ఎం. రాంబాబు అనే రైతు వద్ద పొగాకు సీజన్ పనిచేసేందుకు 6 నెలల క్రితం వచ్చారు. అయితే గురువారం ఉదయం రైతు పొలంలో పొగాకు ఆకు కట్టుకు వెళ్లి వచ్చిన తర్వాత క్యూరింగ్‌కు ఎక్కించిన అనంతరం పునుగు బజ్జీలు తిన్నట్లు తెలిపారు. అయితే పని పూర్తి చేసుకుని ఇళ్లకు వెళ్లి రాత్రి 8 గంట ప్రాంతంలో కళ్లు తిరగడం ప్రారంభమైందని తర్వాత వాంతులు, విరోచనాలు అవ్వడంతో హుటాహుటిన రాత్రికిరాత్రే దొరమామిడి ప్రభుత్వాస్పత్రిలో చేరారు. వీరికి స్థానిక వైద్యులు వైద్య పరీక్షలు చేయడంతో పాటు ప్రాథమిక వైద్యసేవలు అందించి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో తరలించారు. అక్కడ వైద్యం పొందిన కూలీల ఆరోగ్యం నిలకడగా ఉందని ఎలాంటి ప్రాణహాని లేదని వైద్యులు చెప్పారు. ఫుడ్ పాయిజన్ వల్లే కూలీలు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. అయితే కూలీలందరూ శుక్రవారం సాయంత్రం డిశ్చార్జ్ అయ్యారు. అయితే పొగాకు తోటలో కొట్టిన మందులు కారణంగానే ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఆకులకు కొట్టిన మందు సారం కూలీల చేతికి అంటుకోవడంతో వారు సరైన జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే భోజనం చేసిన కొద్దిసేపటికి అస్వస్థతకు గురైనట్లు తెలుస్తుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కైకలూరు: అతివేగంగా వచ్చిన లారీ వ్యక్తిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కైకలూరు మండలం ఆలపాడు శివారు ఉప్పుటేరు వంతెన వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గమ్మళ్లపాడు గ్రామానికి చెందిన యాళ్ళ భీమరాజు(42) కూలీ పనులు చేస్తున్నాడు. వివాహ నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా అడవికొలను గ్రామానికి ద్విచక్రవాహనంపై ఉదయం వెళ్లాడు. తిరిగి వస్తుండగా రాత్రి 8 గంటల ప్రాంతలో ఉప్పుటేరు వంతెన దిగవభాగంలో లారీ వచ్చి ఢీకొట్టి కొంతదూరం ఈడ్చూకువెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతినికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం చేశాడు. రెండో కుమార్తె చదువుకుంటుంది. అల్లుడు కూడా ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతుని భార్య బతకుదెరువు కోసం కొద్ది నెలల క్రితం కువైట్ వెళ్ళింది. బంధువుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

ద్వారకాతిరుమలలో కారు దగ్ధం



ద్వారకాతిరుమలలో రోడ్డుపై దగ్ధమవుతున్న కారు

ద్వారకాతిరుమల : నడుస్తున్న కారు నుంచి మంటలు, పొగలు వచ్చి ముందు భాగం పూర్తిగా దగ్ధమైన ఘటన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక రాజస్థాన్ హోటల్ ఎదుట జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాల ప్రకారం భీమవరానికి చెందిన శివప్పు చల్లారావు శ్రీవారి దర్శనార్థం తన స్నేహితుడి కారులో కుటుంబ సమేతంగా క్షేత్రానికి విచ్చేశాడు. స్వామి వారి దర్శనానంతరం టిఫిన్ చేసేందుకు వారు హోటల్‌కు వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో ఘటనాస్థలం వద్ద కారుని యూటర్న్ చేస్తుండగా ఒక్కసారిగా బానెట్ నుంచి మంటలు, పొగలు వచ్చాయి. దీంతో భయాందోళనకు గురైన భక్తుడి కుటుంబ సభ్యులు వెంటనే కారు నుంచి దిగి, దూరంగా వెళ్లారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కారు వద్దకు చేరుకుని పక్కనే ఉన్న మంచినీటి పైప్ ద్వారా మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అరగంట తరువాత మంటలు ఆరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బ్యాటరీ వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే ప్రమాదం సంభవించినట్లు గుర్తించారు. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో రోడ్డుపై వెళుతున్న వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు.

దారి కాచి యువకుడిపై దాడి

తణుకు: యువకుడిని దారి కాచి మరీ తీవ్రంగా గాయపర్చిన ఘటన తణుకు మండలం కొమరవరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం కొమరవరం గ్రామానికి చెందిన మేడే రామ్మూర్తి తల్లి మరియమ్మ అదే గ్రామానికి చెందిన ముత్యాల సుబ్బారావు పొలంలో గతం కొంత కాలంగా పని చేస్తుంది. ఇటీవల తన తల్లిని ఇకపై పనిలోకి పంపించనని చెప్పడంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న ముత్యాల సుబ్బారావు, ముత్యాల సాయి మరికొందరితో కలిసి శుక్రవారం ఉదయం బైక్‌పై వెళుతున్న రామ్మూర్తిని దారి కాచి ఇనుప రాడ్‌లతో తలపై తీవ్రంగా కొట్టి గాయపరిచారు. బాధితుడు తణుకులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.చంద్రశేఖర్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

ఏలూరు టౌన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతంలో కొంతమంది యువకులు గంజాయి కార్యకలాపాలు సాగిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై మదీనాభాషా శుక్రవారం తన సిబ్బందితో వెళ్లి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. తనిఖీలు చేయగా యువకులు గంజాయి కలిగి ఉన్న భీమడోలు గణపతినగర్‌కు చెందిన పప్పుల సురేష్, స్థానిక గ్లేవియర్ నగర్‌కు చెందిన నడిపూరు కల్యాణ్, తంగెళ్లమూడికి చెందిన పరవాక అశోక్, మరో 17 సంవత్సరాల బాలుడిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 6 కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మేకల ఎరువు..చేలకు ఎంతో మేలు



వీరవాసరం: వ్యవసాయ సాగులో ఎరువుల పాత్ర ప్రధాన కీలకంగా ఉంటుంది. పంట ఏపుగా రావడానికి, నాణ్యతగా ఉండడానికి, అధిక దిగుబడి సాధించడానికి ఎరువులే కీలక భూమిక పోషిస్తున్నాయి. ఎరువులను పెంట ,పేడ రూపంలో వరి చేలల్లో రైతులు వేస్తుంటారు. పశువుల పెంట మాదిరిగానే గొర్రెలు మేకల పెంటను సైతం వరి చేలలో వేస్తుంటారు. ముఖ్యంగా దాళ్వా సీజన్ పూర్తయిన తరువాత సార్వ సీజన్‌కు మధ్యలో వేసవికాలం కావడంతో వరి చేలల్లో గొర్రెలను, మేకలను మేపుతుంటారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల నుంచి, గుంటూరు-తెనాలి, బాపట్ల, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల నుంచి గొర్రెలను, మేకల మందలను పెద్ద ఎత్తున జిల్లాలోని వరిచేలలో మేపడానికి మందలను దించుతుంటారు .ప్రతి ఏడాదీ ఆయా ప్రాంతాల నుంచి ఖాళీ వరి భూముల్లో గొర్రెల మందలు, మేకల మందలను పెద్ద ఎత్తున తీసుకుని వచ్చి చేలల్లోనే మకాం వేస్తుంటారు .వరి చేలల్లోనే మేకలు గొర్రెలు మేసే సమయంలోనే అవి విసర్జిస్తుంటాయి. ఇవి వరి చేలకు ఎంతో ఉపయోగకరంగా సేంద్రియ ఎరువుగా సారవంతమైన నేలను తయారు చేయడానికి ఉపకరిస్తుంటాయి. రైతులు తమ తమ వరి చేలల్లో గొర్రెలు, మేకల మందలను కట్టడానికి డబ్బులు సైతం ఇస్తుంటారు. ఖాళీ చేలలో గుంపులు, మందలుగా చుట్టూ కంచి మాదిరిగా వలను వేసి చేలల్లోనే ఉంచి పెంట పేడ, ఇతర విసర్జకాలు ఉండే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంటారు. దీనివలన ఆ నేలంతా ఎరువుతో నిండి పంట సమయంలో సేంద్రియ ఎరువుగా పని చేస్తుంటుంది. రైతులకు దీని వల్ల ఎంతో ఉపయోగకరంగా ఉండి అధిక దిగుబడులు కూడా సాధ్యమవుతాయి.

చేనుకు ఎంతో ఉపయోగం



ప్రతి ఏడాదీ గుంటూరు నుంచి వస్తుంటాము. గొర్రెలు, మేకలను మందలుగా మేపుకుని తిరిగి వెళ్లిపోతుంటాం .ఒక్కో మందలో 200 నుంచి 500 వరకు గొర్రెలు, మేకలు ఉంటాయి. ఖాళీ వరి చేలలో మందలు కట్టడానికి రోజుకు రైతులు రూ.500 నుంచి రూ.750, బియ్యం ఇస్తుంటారు. గొర్రెలు ,మేకలు విసర్జించే పెంట వంటి మలమూత్రాలు చేనుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. రైతులు పోటీలు పడి మరీ చేలల్లో మందలను కట్టించుకుంటారు.

– మన్నే సత్యనారాయణ, గొర్రెల కాపరి, గుంటూరు

పోలవరంలో గ్రావెల్ అక్రమ తరలింపు



విద్యుత్ స్తంభం సమీపం వరకు గోతులు తవ్విన దృశ్యం

పోలవరం రూరల్: పట్టిసీమ ఎత్తిపోతల పథకం సమీపంలో డంపింగ్ చేసిన గ్రావెల్ గత కొద్ది రోజులుగా అక్రమంగా తరలించేస్తున్నారు. ట్రాక్టర్‌లపై నిత్యం ప్రధాన రోడ్డు మార్గంలో తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. పోలవరం నుంచి ఇటికలకోట గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం సమీపంలో కుడికాలువలో తవ్వగా వచ్చిన గ్రావెల్‌ని ఆ ప్రాంతంలో డంపింగ్ చేసి నిల్వ చేశారు. ఈ ప్రాంతంలో గ్రావెల్‌ని తవ్వకూడదని సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ అక్రమ తరలింపు మాత్రం ఆగలేదు. కొన్ని ప్రాంతాల్లో కుడి కాలువ ప్రదేశంలో మెషీన్‌ల సహాయంతో ట్రాక్టర్‌లపై లోడ్ చేసి తరలించేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఎత్తిపోతల పథకం ప్రాంతంలో గిరిజన గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం పక్కనే సుమారు 6 నుంచి 8 అడుగుల లోతున పెద్ద పెద్ద గోతులు పెట్టి గ్రావెల్‌ని తరలించేశారు. గిరిజన గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్ స్తంభాలకు సమీపంలో ఈ గోతులు చేరుకున్నాయి. ఇదిలా ఉంటే భారీ వర్షాలు కురిస్తే ఈ గోతులన్నీ వర్షపు నీటితో నిండిపోయి రోడ్డు సమీపంలోకి నీరు చేరే పరిస్థితి ఉంది. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపడితే విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిల్వ చేసిన గ్రావెల్‌ని నిత్యం తరలించేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రావెల్ అక్రమ తరలింపును అడ్డుకోవాలని కోరుతున్నారు.

గిరిజన స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బంధం ప్రసాద్

వేలేరుపాడు: ఏజెన్సీలో గిరిజన స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని గిరిజన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బంధం ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేలేరుపాడులో శుక్రవారం నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఐటీడీఏలో పరిధిలో ఉన్న స్కూల్స్ టీచర్ రిక్రూట్మెంట్‌ను స్పెషల్ డీఎస్సీగా ప్రకటించి ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలన్నారు. గిరిజన యువతి యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఏజెన్సీలో నూటికి నూరు శాతం గిరిజనులకు రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. ఈ మెగా డీఎస్సీ విడుదల చేసిన వెంటనే ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న ఐటీడీఏ పరిధిలో స్పెషల్ డీఎస్సీ ప్రకటించి గిరిజన యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ముందే ఆదివాసి ప్రాంతాల్లోనే ఉపాధ్యాయ పోస్టులకు విధివిధానాల్లో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఐటీడీఏలో పరిధిలో ఉన్న ఏజెన్సీ మండలాల ప్రత్యేక నిరుద్యోగ యువతీ యువకులకు డీఎస్సీ ఫ్రీ కోచింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మిర్యాల శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు పైదా రమేష్, గిరిజన సంక్షేమ పరిషత్ అడ్వయిజర్ కారం నాగేశ్వరావు, హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ యూనియన్ నాయకులు కుడియం శివరాజు, మండల గిరిజన సంక్షేమ పరిషత్ కన్వీనర్ సభ్యులు తెల్లం శివ, తెల్లం వెంకట్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



వడలిలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కౌలు రైతు

పెనుగొండ: కోటి ఆశలతో సాగుకు సన్నద్ధమైన కౌలు రైతును విద్యుత్ తీగ రూపంలో మృత్యువు కబళించింది. పెనుగొండ మండలం వడలి గ్రామానికి చెందిన కౌలు రైతు తానేటి గంగయ్య (58) మృత్యువాత పడ్డాడు. గురువారం సాయంత్రం పొలం వెళ్లిన తానేటి గంగయ్య విద్యుత్ వైరు తగిలి మృతి చెందాడు. అయితే గంగయ్య రాత్రంతా తిరిగి రాకపోవడంతో బంధువులు గాలింపు చేసినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం తిరిగి గాలింపు చేపట్టగా పొలంలో విగత జీవుడై పడిఉన్న గంగయ్యను గుర్తించారు. గంగయ్యకు భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారుడు ఇచ్చిన పిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ సుభానీ తెలిపారు.

గంగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో మృత్యువాత పడిన గంగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం వడలి శాఖ డిమాండ్ చేసింది. విద్యుత్ శాఖ తీగలు ఏర్పాటు చేయడం లోనూ, ఉపయోగం లేని తీగలు తొలగించడంలోనూ నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వం కౌలు రైతు గంగయ్య కుటుంబానికి రూ.15 లక్షలు చెల్లించాలని సీపీఎం నాయకులు వేడంగి సర్వేశ్వరరావు, తొంటా సత్యనారాయణ, రుద్ర రామాంజనేయులు, ఆవుల శ్రీనివాసరావు, కోమటి సత్యనారాయణలు డిమాండ్ చేశారు.

యువకుడి ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: మనస్థాపంతో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ప్రకారం ఒంటెద్దు నరసింహారావు(25) అనే వ్యక్తి జంగారెడ్డిగూడెంలోని పెద్దనాన్న ఇంటి వద్ద ఉంటున్నాడు. జనవరి నెలలో నరసింహారావు తండ్రి మృతిచెందాడు. అప్పటి నుంచి నరసింహారావు మానసిక స్థితి సరిగా లేదన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్థానిక పిరమిడ్ వద్ద కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయాన్ని క్రాంతి కుమార్ అనే యువకుడికి చెప్పగా, క్రాంతి ఘటనా స్థలానికి వెళ్లి అప స్మారకంలో ఉన్న నరసింహారావును స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించి వైద్యులు అప్పటికే నరసింహారావు మృతిచెందినట్లు చెప్పారు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఒంటెద్దు సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

క్లుప్తంగా

పాలిటెక్నిక్‌తో ప్రయోజనాలెన్నో



సమావేశంలో మాట్లాడుతున్న పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: పాలిటెక్నిక్ చదువుతో ప్రయోజనాలెన్నో ఉన్నాయని వాసవీ పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి ఏడాది తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి తర్వాత విద్యార్థులు ఇంటర్మీడియట్ చదవాలా, పాలిటెక్నిక్ చదవాలా అనే సందిగ్ధంలో ఉంటారని, ఇంజనీరింగ్ పట్ల ఆసక్తి ఉన్నవారు పాలిటెక్నిక్‌ను ఎంచుకుంటే మంచి ఫలితాలతో పాటు చక్కని భవిష్యత్‌ను సాధించడానికి అవకాశం ఉందన్నారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడం వల్ల ఇంజనీరింగ్ సబ్జెక్టుల్లో పట్టును సాధించి పారిశ్రామిక రంగ అవసరాలకు ఉపయోగపడే విధంగా కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గీతామందిరంలో రంగస్థల కళాకారుల సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మండల రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం 145వ నెలవారి సభా కార్యక్రమం ఈ నెల 30వ తేదీ ఆదివారం సాయంత్రం గీతా మందిరంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి తగరంపూడి మురళీకృష్ణలు తెలిపారు. పెదవెల్లమిల్లికి చెందిన వాస్తు పండితులు దండమూడి సత్యనారాయణకు గౌరవ సత్కారం, భీమవరంనకు చెందిన సాయి ఘంటసాల ఆర్కెస్ట్రా నిర్వాహకులు తమిరి సాంబమూర్తికి కళా సత్కారం, కొమ్ముగూడెం వ్యాయమ ఉపాధ్యాయులు కొత్త సుభద్రకు ఉద్యోగ సేవా పురస్కారం, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సీనియర్ భజన కళాకారుడు ఇసరపు అబ్బులకు ఆర్థిక సత్కారం అందజేస్తామని తెలిపారు.

శశి డైరెక్టర్ భానుప్రసాద్ కన్నుమూత


శశి కళాశాల డైరెక్టర్ కె.భానుప్రసాద్

తాడేపల్లిగూడెం: శశి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.భాను ప్రసాద్ అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. ఇంజనీరింగ్ కళాశాలలో సుదీర్ఘ కాలంపాటు ప్రిన్సిపాల్‌గా తర్వాత డైరెక్టర్‌గా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మృతిపట్ల సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ , వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ, ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్ వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది నివాళులర్పించారు.

జర్నలిస్టులకు ప్రోత్సాహం అందిస్తాం


జర్నలిస్టుల పిల్లలకు నోట్సుపుస్తకాలు పంపిణీ చేస్తున్న స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు

పెంటపాడు: త్రిపుల్ కర్మాగారం చేస్తున్న సేవా కార్యక్రమాలతో పాటు, జర్నలిస్టులకు తప్పక ప్రోత్సాహం అందజేస్తామని త్రిపుల్ ఎఫ్ డైరెక్టర్ ఓపీ గోయంకా పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జర్నలిస్టుల పిల్లలకు చదువుకొనేందుకు వీలుగా నోట్సు పుస్తకాలను స్వాభిమాన్ ట్రస్టు, త్రిపుల్‌ఎఫ్ కర్మాగారం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి గూడెం ఏరియా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తమ్మిశెట్టి రంగ సురేష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గూడెం ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులతో పాటు, త్రిపుల్ ఎఫ్ హెచ్‌ఆర్ మేనేజర్, స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు జనార్ధన్, వేమల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని హెచ్‌ఎం బీ.జ్యోతి తెలిపారు. స్థానిక సుబ్బారావుపేట ఐదోవ వార్డు ప్రాథమిక పాఠశాల, భవిత సెంటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, ఉపాధ్యాయిని కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హౌసింగ్ బోర్డు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 29వ తేదీ శనివారం 11 కేవీ రైల్వే ఫీడర్‌కు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు.

నడుద్దాం.. రోగాలను జయిద్దాం

- మారుతున్న జీవనశైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యం
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్ల సందడి
- ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ


జాగింగ్ చేస్తున్న వాకర్స్

తణుకు అర్బన్: మారుతున్న జీవనశైలి కారణంగా అనేక మంది ఊబకాయం, షుగర్, బీపీ తదితర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నారు. వీటన్నింటినీ ఎదుర్కొనేందుకు నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్య నిపుణులు చెబుతున్నారు. కేవలం మందులతోనే సరిపెట్టుకోకుండా క్రమం తప్పకుండా వాకింగ్ అలవాటు చేసుకుంటే మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని సూచిస్తున్నారు. నేటి ఆధునిక కాలంలో సైన్స్ దినదినాభివృద్ధి చెంది నడిచే రోజులు పోయి గాలిలో దూసుకుపోతూ ఎగిరే కాలం వచ్చింది. దీంతో మానవాళిలో అనేకరకాల ఆరోగ్య సమస్యలు, మానసిక ఆందోళన, ఒత్తిడి వంటి పరిస్థితులు కుంగదీస్తుండగా, మరోపక్క నేటి ఆహార అలవాట్లు, జీన్స్ వంటి పరిస్థితుల్లో ఊబకాయం సమస్య కూడా తీవ్రతరమైంది. ఏ వైద్యుడికి చూపించినా నడవండి ఆరోగ్యం బాగుంటుందని చెబుతున్నారు. అంతేకాకుండా రెండేళ్లపాటు మరణమృదంగం వాయించిన కోవిడ్ మహమ్మారి సైతం ఆరోగ్యం పట్ల హెచ్చరికలు జారీచేసి వెళ్లింది. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వారి పరిమితిని బట్టి నడిచేస్తున్నారు. వయస్సుకు సరిపడా అడుగులు వేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

ఉదయం, సాయంత్రం నడక..

నడకపై ఏర్పడిన అవగాహనతో దినకరుడు రాకముందే పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలు, ఖాళీ మైదానాల్లోను, గ్రామాల్లో అయితే ఊరి పొలిమేర వరకు చకచకా నడిచేస్తున్నారు ప్రజలు. ముఖ్యంగా ఉదయం నడక కారణంగా సూర్యరశ్మి శరీరాన్ని తాకి ఎముకల్లో కాల్షియం లోపాలను అధిగమించవచ్చని వైద్యులు చెబుతుండడంతో అధికశాతం ఉదయాన్నే నడుస్తుండగా, ఉదయం కుదరని వారు మాత్రం సాయంత్రం నుంచి రాత్రి వరకు నడక పని పెట్టుకున్నారు. తణుకులో శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాకర్స్‌కు వేదికగా మారింది. వాకింగ్ అనంతరం వ్యాయామాలు, యోగా చేస్తున్నారు. సీనియర్ సిటిజన్స్ నడక అనంతరం పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటున్నారు. జెడ్పీ బాయ్స్ హైస్కూలు క్రీడా ప్రాంగణం, జాతీయ రహదారి, రాష్ట్రపతి రోడ్డు, సుగర్స్ పార్కు ప్రాంతాల్లో వాకర్స్ విధిగా నడిచేస్తున్నారు. ఏ రోగమని ఆస్పత్రికి వెళ్లి వైద్యుడిని సంప్రదించినా మందులతోపాటు ప్రతి రోజూ 30 నుంచి 45 నిముషాలపాట నడక తప్పనిసరి అని చెబుతున్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి వ్యాధిగ్రస్తులకు ఈ నడక ఎంతో మేలు చేస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా శరీర అవయవాలకు రక్తప్రసరణ బాగా జరిగి గుండె పనితీరు బాగుంటుందనేది వైద్యుల సూచన.

నడకతో ప్రయోజనాలివే...

- క్రమం తప్పకుండా నడవడం వల్ల ఎండారిఫ్స్ అనే హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
- ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, కంగారు అంశాలను అధిగమించవచ్చు.
- గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పనిచేస్తాయి.
- గుండె సంబంధిత జబ్బులు, పక్షవాత వంటివి దరిచేరవు.
- అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను నియంత్రిస్తుంది.
- కీళ్లు, కండరాలు సాగుతూ శక్తి పెరిగి నడిచేందు కు పూర్తిస్థాయిలో సమతుల్యత తీసుకువస్తుంది.
- శరీరంలోని అధిక కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది.
- శరీరానికి మంచి శ్వాస, అధికస్థాయిలో ఆక్సిజన్ తీసుకునేలా చేస్తుంది.
- మోకాలు, చీలమండలు మృదువుగా మారి అనుకూలంగా ఉంటాయి.
- ఎముకలు ధృడంగా తయారవుతాయి.
- మానసికంగా ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ఇస్తుంది.
- రక్తంలోని కొవ్వు కరుగుతుంది.
- జీవితకాలం పెరుగుతుంది.
- మెదడును ఉత్తేజితం చేస్తుంది.
- అధిక బరువును తగ్గిస్తుంది.
- విటమిన్ డి లోపం ఉండదు.
- క్యాన్సర్ రిస్కు తగ్గిస్తుంది.
- వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

నడక జీవిత కాలాన్ని పెంచుతుంది



30 సంవత్సరాలు దాటిన వారంతా నడకను దినచర్యగా తీసుకోవాల్సిన అవసరంఉంది. నడక కారణంగా ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. దీంతో గుండె సంబంధిత జబ్బులు రావు.

– రావుల రాంబాబు, వాకర్, తణుకు

నడక జీవనశైలిలో భాగంగా మారింది



నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో వాకింగ్, జాగింగ్ ఒక భాగంగా చేసుకోవాలి. నిత్యం నడక నడిచే అలవాటున్న వారికి అనారోగ్యాలు దరిచేరవు. మంచి ఆరోగ్యానికి నడకను ఒక పరిష్కారంగా చెప్పుకోవచ్చు. గత 8 ఏళ్లగా వాకింగ్, జాగింగ్ చేస్తూ ఎంతో ఆరోగ్యంగా ఉన్నాను.

– అత్యం వెంకటరత్నం, వాకర్, తణుకు

వాకింగ్‌తో ఉల్లాసం..



వాకింగ్ చేస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి అధికమవుతున్న నేటి రోజుల్లో ప్రతి ఒక్కరూ వాకింగ్ చేయాలి. బీపీ, షుగర్ వంటి వ్యాధులు రావు. అవి ఉన్నవారిలో వ్యాధులు నియంత్రణలోనే ఉంటాయి. వాకింగ్ చేయని రోజు ఎంతో బద్ధకంగా ఏ పనిచేయ బుద్ధి కాని పరిస్థితి వస్తుంది.

– సంగిరెడ్డి శ్రీనివాస్, వాకర్, తణుకు

లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్


గురుకుల పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధన దిశగా కృషి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపల్ బి.రాజారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ స్కాట్లాండ్ బ్యాండ్‌లో గురుకుల పాఠశాల దేశంలోనే రెండవ స్థానంలో నిలవడంలో ప్రిన్సిపల్ రాజారావు కృషి ఉందన్నారు. విద్యార్థులు ఏదోక లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. పాఠశాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. మండలంలోని పెదతాడేపల్లి పంచాయతీ వద్ద శుక్రవారం క్రీడాకారులకు క్రికెట్ కిట్లను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. సర్పంచ్ పోతుల అన్నవరం, ఎంఈవోలు వి.హనుమ, పీఎంకే.జ్యోతి, నాయకులు పసుమర్తి చందు, పుల్లా బాబి, పైబోయిన రఘు, పుల్లా బాబి, మద్దిపాటి ధర్మేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలుసులమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం (టీఓసీ): బలుసులమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ రవి శంకర్, శ్రీరంగం అంజిబాబు, నిమ్మకాయల యూత్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు తణుకు వాసులకు యోగరత్న అవార్డులు



యోగరత్న అవార్డు అందుకుంటున్న చక్రధరరావు

తణుకు: ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు ప్రాంతానికి చెందిన ఇరువురు యోగరత్న అవార్డులు అందుకున్నారు. వర్ణధార హెల్త్ ఆర్గనైజేషన్ (వీహెచ్‌వో), కాకినాడకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పిరిట్యువల్ హ్యాపీనెస్ అండ్ హెల్త్ (ఐఎస్‌హెచ్‌హెచ్) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన కట్టుంగ రామచక్రధర రావు, తణుకు పట్టణానికి చెందిన బొద్దాని శ్రీనివాసరావులకు యోగరత్న అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వీరిద్దరూ ఎంపిక కావడం విశేషం.

గణపతి విగ్రహం చెయ్యి విరగ్గొట్టిన దుండగులు


గణపతి విగ్రహం చేయి విరిగిన దృశ్యం

అత్తిలి: స్థానిక కెనాల్‌రోడ్డు విజయచాముండేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నెలకొల్పిన గణపతి విగ్రహం చేతిని గుర్తు తెలియని వ్యక్తులు విరగొట్టినట్లు ఆలయ ధర్మకర్త కందుల సత్యనారాయణ శుక్రవారం అత్తిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయ చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా గత ఏప్రియల్ నెలలో శివలింగం, వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయకుని విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ఈ ఆలయ అర్చకునిగా కలగ కృష్ణవంశీ పని చేస్తున్నారని, గురువారం సాయంత్రం ఒక భక్తుడు ఉపాలయంలో వినాయకుని విగ్రహం చేయి విరిగినట్లు గుర్తించి, ఆలయ అర్చకుడు కృష్ణకు తెలపడంతో ఈవిషయాన్ని తనకు సమాచారం ఇచ్చాడన్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి రాంబాబు తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం అంగన్‌వాడీ సెంటర్ నెం.129 ఆధ్వర్యంలో శుక్రవారం సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సికిల్ సెల్ ఎనీమియా అనేది వంశపారంపర్యంగా రక్తం ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం టి.సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇ.సూర్యకుమారి, పి.ప్రమీల, పి.కనక దుర్గాంబ, ఆశా కార్యకర్తలు ఎం.నాగమణి, సీహెచ్. లక్ష్మి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలి



తణుకులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తణుకు అర్బన్: పౌర హక్కులకు భంగం కలిగించే కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తణుకు బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఆల్ ఇండియా లాయర్స్ ఆధ్వర్యంలో జూలై 1వ తేదీ నుంచి అమలు కాబోతున్న కొత్త క్రిమినల్ చట్టాలపై న్యాయవాదులు తమ నిరసన తెలిపారు. కొత్త చట్టంలో పౌర హక్కుల స్వేచ్ఛకు, న్యాయవ్యవస్థ స్వతంతతను తగ్గించే విధంగా రూపొందించారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఏ వ్యక్తికి కూడా సంకెళ్లు వేయరాదని అతని స్వేచ్ఛకు భంగం కలిగించరాదని తీర్పులు ఇవ్వగా నేడు కొత్త చట్టం ప్రకారం చేతులకు బేడీలు వేసే విధంగా ఉందని, న్యాయవ్యవస్థకు ఉన్న అధికారాలను తగ్గించి, పోలీసు అధికారులు, ఎగ్జిక్యూటివ్ అధికారులకు జ్యుడీషియల్ అధికారాలను కట్టబెట్టే విధంగా కొత్త చట్టాన్ని మార్పు చేశారని విమర్శించారు. ఈ చట్టాలు కేవలం రాజకీయ నాయకులకు అనుగుణంగా ఎగ్జిక్యూటివ్ అధికారులు పనులు చేయుటకు అమలు చేసిన చట్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎ.దుర్గాపశాంతి, కామన మునిస్వామి, చింతపల్లి నాగేశ్వరరావు, హరీష్‌నాయుడు, జి.అంబేద్కర్, ఎస్.సోమేశ్వరరావు, ఎస్‌కే బాజీ, పి.ప్రతాప్‌కుమార్, సాంసన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ముదునూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన భానునాయక్

పెంటపాడు: సీజనల్ వ్యాధులపై అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆరోగ్యశాఖ అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పెంటపాడు మండలం ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, మందుల గది, స్టాక్ రిజిస్టర్ తదతర రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రబలే వ్యాధుల పట్ల సిబ్బంది, సబ్‌సెంటర్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నాను. పీహెచ్‌సీలలో జరిగే సాధారణ సమావేశాలలో ప్రధానంగా గ్రామీణ తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, సూపర్‌వైజర్‌లు, ఫార్మసీ రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే బెస్ట్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతాం


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వసతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గుండెపోటు సందర్భాల్లో చేయాల్సిన అత్యవసర సేవలతోపాటు క్యాన్సర్ కీమోథెరపీ వంటి సేవలను సంబంధిత రోగులు వినియోగించుకోవాలని, కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాముఖ్యతనిస్తుందని, రానున్న రోజుల్లో జిల్లా ఆస్పత్రికి ఉండాల్సిన సదుపాయాలన్నీ కలుగచేసి రాష్ట్రంలోనే బెస్ట్ ఆస్పత్రిగా తణుకు ఆస్పత్రిని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ రోగులకు సత్వర సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

తణుకు టౌన్: వస్తువుల కొనుగోలు చేసే వినియోగదారుల హక్కులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్ జీఎస్‌ఆర్ శంకర్ చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వినియోగదారుల క్లబ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. ఈకార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం ఎం ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులు వినియోగదారుల హక్కులను గుర్తించి వాటి పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రథమ సహాయకులు మూర్తి, గైడ్ టీచర్ స్వరూపరాణి, ఉపాధ్యాయులు ఎం యేసుకృప, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.